సాక్షి
కాకినాడ

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



అన్నదాన ట్రస్టుకు విరాళం


ఆలమూరు: చింతలూరు గోపరంధామం గోశాల అన్నదాన ట్రస్టుకు నెక్కంటి రామారావు జ్ఞాపకార్థం భార్య రామసీత కమలావతి (పెదపళ్ల) రూ.50 వేల విరాళం అందజేశారు.



అన్నదానానికి విరాళం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో అన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన వి.జితేంద్ర శనివారం రూ.లక్ష విరాళం అందజేశారని ఈఓ సూర్యనారాయణ తెలిపారు.

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 12,124 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రం లోకి విడిచి పెట్టారు. డెల్టా కాలువలకు నీటి విడుదలను శనివారం పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు



ఏలేరులోకి చేరిన వరద నీరు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు స్థానిక ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి. ఎగువ ప్రాంతం నుంచి 1780 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరింది. శనివారం నాటికి ఏలేరు ప్రాజెక్ట్‌లో 86.56 మీటర్లకు గాను 79.67 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 13.07 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. విశాఖకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఖోఖో జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళా ఖోఖో జట్టుతో అతిథులు

తుని రూరల్: ఈ నెలాఖరున జరిగే రాష్ట్రస్థాయి మహిళా ఖోఖో టోర్నమెంట్‌కు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్టు ఖోఖో సెలక్షన్స్ అబ్జర్వర్ వై.సుధారాణి, కోచ్ కె.లోవ పాపారావు శనివారం తెలిపారు. మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ (అటానమస్) డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు ఇంటర్ కాలేజీల ఖోఖో పోటీలు, జట్టు ఎంపికలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 15 మందిని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జట్టుగా ఎంపిక చేశామన్నారు. ఇంటర్ కాలేజీల ఖోఖో పోటీల్లో గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్‌జీసీపీ కాలేజీ (ప్రథమ స్థానం), రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ (ద్వితీయ స్థానం), తుని ప్రభుత్వ కళాశాల (తృతీయ స్థానం) సాధించాయని వివరించారు. విజేతలకు అతిథులు కలిదిండి సత్యనారాయణరాజు, ప్రొఫెసర్ గంట్ల చిన్నారావు, నోబుల్ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రస్థాయిలో రాణించి యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, హెచ్‌ఓడీ బి.నాగరాజు, పీడీ ఎస్.రాజేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన దుర్గా ప్రసాద్

కొత్తపల్లి: కత్తిపూడి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై బోగపురం జంక్షన్ సమీపంలో అగి ఉన్న ట్రాక్టర్‌ను ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన నీలి దుర్గాప్రసాద్ (24), కె.సాయి ఢీకొట్టారు. ఈ ఘటనలో దుర్గాప్రసాద్ మృతి చెందగా, సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అన్నవరం సత్యదేవుని దర్శించుకుని మోటర్ సైకిల్‌పై ద్రాక్షారామం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయం

గఘనకీర్తి

- మధురపూడి ఎయిర్‌పోర్టుకు మహర్దశ
- అంతర్జాతీయ స్థాయి వసతుల కల్పనకు అడుగులు
- రూ.347 కోట్లతో డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం
- పనులకు నేడు శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- 5 పెద్ద విమానాల టేకాఫ్‌కు అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి

సాక్షి, రాజమహేంద్రవరం/మధురపూడి: ఉభయ గోదావరి జిల్లాల వాసులకు గగనతల ప్రయాణ సేవలు అందిస్తున్న మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయి వసతులు సమకూరనున్నాయి. భవిష్యత్తులో దీనికి ఉన్నత ఖ్యాతి తీసుకువచ్చేందుకు మరో అడుగు పడింది. ఇప్పటికే 3,165 మీటర్ల పొడవున్న రన్‌వే, 11 పార్కింగ్ బేస్‌తో కూడిన యాప్రాన్, 11 విమానాలు ఏక కాలంలో నిలుపుదలకు ఇక్కడ అవకాశం ఉంది. దీనికి తోడు అంతర్జాతీయ స్థాయికి అవసరమైన సదుపాయాలుండటంతో ఎయిర్‌పోర్ట్ సేవలను మరింత విస్తరించేందుకు పౌర విమానయాన శాఖ కార్యాచరణ అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా టెర్మినల్ భవన సామర్థ్యం పెంపుపై దృష్టి సారించింది.

ఇందులో భాగంగా ఎయిర్‌పోర్టులో రూ.347.15 కోట్లతో అధునాతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతోంది. **ఈ పనుల శంకుస్థాపనకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆదివారం మధురపూడి రానున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్,** రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర నాయకులు పాల్గొంటారు.

ఎయిర్‌పోర్ట్ ప్రస్తుత సామర్థ్యం

విమానాశ్రయంలో ప్రస్తుత టెర్మినల్ భవనం 4,065 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. ఇది ఏకకాలంలో 225 మంది ప్రయాణికులు స్టే చేసేందుకు మాత్రమే సరిపోతోంది. వాస్తవానికి ఇక్కడ అంతర్జాతీయ స్థాయికి అవసరమైన సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం 90 శాతం ఆక్యుపెన్సీతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు 18 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ప్రతి రోజూ 1,200 మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇండిగో సంస్థ మాత్రమే ప్రస్తుతం సర్వీసులు నిర్వహిస్తోంది. గతంలో ట్రూజెట్, స్పైస్‌జెట్ విమానాలు కూడా నడిచేవి. అనంతరం అవి ఆగిపోయాయి.

అధిక డిమాండ్

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన విమాన ప్రయాణికులు ఎక్కువ శాతం మంది ఇక్కడికే వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. వారాంతపు సెలవుల్లో సమయం ఆదా అవుతుందనే ఉద్దేశంతో వీరిలో పలువురు విమానంలో వస్తున్నారు. వీరి సంఖ్య పెరుగుతూండటంతో ఇక్కడి నుంచి విమాన ప్రయాణానికి డిమాండ్ పెరిగింది. కాకినాడ, అమలాపురం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన వారు మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సైతం విమాన ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. చెన్నైలో స్థిరపడిన జిల్లావాసులు రైస్, లెదర్, వస్త్ర, బంగారు, కొబ్బరి వ్యాపారాలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి స్వర్ణ వర్తకులు, వ్యాపారులు తరచూ ముంబయి, గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. వీరందరికీ ఇకపై నేరుగా ప్రయాణించే వీలు కలుగుతుంది. ఉమ్మడి జిల్లాల నుంచి వీరు మూడు గంటల వ్యవధిలోనే మధురపూడి విమానాశ్రయానికి చేరుకునే అవకాశం ఉంది.

రెండేళ్లలో టెర్మినల్ నిర్మాణం



టెర్మినల్ భవన నిర్మాణానికి పరిపాలనా అనుమతులు అందాయి. నిధులు విడుదలయ్యాయి. కేంద్ర మంత్రి సింధియా చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. రెండేళ్లలో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తాం. భవనాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ భవనం రూపుదిద్దుకుంటే 1,400 మంది స్టే చేసే వీలుంటుంది. అధునాతన సేవలు అందించే అవకాశం కలుగుతుంది.

– ఎస్.జ్ఞానేశ్వరరావు,
రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

టెర్మినల్ సామర్థ్యం పెంపుతో ప్రయోజనం

- **ప్రస్తుత టెర్మినల్‌ను 16 వేల** చదరపు గజా**లకు విస్తరించేందుకు** శ్రీకారం చుడు**తున్నారు. రూ.347 కోట్లతో** భవన నిర్మాణం **చేపట్టనున్నారు. ఇది పూర్తయితే** 1,400 మం**ది ప్రయాణికులు స్టే చేయ**వచ్చు. ఐదు అతి **పెద్ద విమానాలు ఒకేసారి** వచ్చిన ఇబ్బం**దులుండవు.**
- **ప్రయాణికుల లగేజీ తనిఖీ** వ్యవస్థను వివిధ **రకాల్లో ఆధునీకరించను**న్నారు. ఇన్‌లైన్ **బ్యాగేజీ సిస్టమ్ అందుబా**టులోకి రానుంది.
- **భద్రత, రక్షణ విషయం**లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తారు. కియోస్క్ ద్వారా ఆధునీకరణ పద్ధతుల్లో ప్రయాణ వివరాలు తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది.

మూడు ఎయిరో బ్రిడ్జిల నిర్మాణం

ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ఎయిరో బ్రిడ్జిలు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ బ్రిడ్జిల ద్వారా ప్రయాణికులు విమానాశ్రయం నుంచి నేరుగా విమానంలోకి వెళ్లే అవకాశం కలుగుతుంది. ప్రయాణికులకు ఆలస్యం జరగదు. టెర్మినల్ భవనం నుంచి విమాన సర్వీసు వరకూ వెళ్లేందుకు సమయం వృథా కాదు. భద్రత, రక్షణ విషయంలో మన ఎయిర్‌పోర్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో దీని నిర్మాణం జరిగింది. యుద్ధ సమయంలో సముద్ర మార్గం ద్వారా రవాణాకు అనువైన ప్రాంతంగా ఇది ఖ్యాతి గడించింది.

బాలబాలాజీకి రూ.5.19 లక్షల ఆదాయం



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ఆరంభమైంది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, తమ కోర్కెలు నెరవేర్చాలని స్వామి వారిని వేడుకున్నారు. వేకువన వేద మంత్రాలు, మంగళవాయిద్య ఘోషతో స్వామి వారికి అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో నిర్వహించే హోమం వైభవంగా జరిపించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.5.19 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.96 లక్షలు, నిత్యాన్న దానానికి విరాళాలుగా రూ.1,94,398 వచ్చాయి. అమ్మవార్లకు భక్తులు సమర్పించిన చీరల వేలం ద్వారా రూ.28 వేల ఆదాయం వచ్చింది. 6,581 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 5,694 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తుల ఏర్పాట్లను ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, ఈఓ జి.శ్రీదేవి పర్యవేక్షించారు.

17న దేవరపల్లిలో సామాజిక సాధికార బస్సుయాత్ర

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో ఈ నెల 17న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు దేవరపల్లిలోని మూడు రోడ్ల కూడలిలో భారీ బహిరంగసభ జరుగుతుందని చెప్పారు. ఈ యాత్రకు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నట్టు ఎమ్మెల్యే వెంకట్రావు తెలిపారు. సుమారు 20 వేల మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు యాత్రలో పాల్గొంటారని తెలిపారు.

విజయానికి ఓటమి తొలిమెట్టు

'నన్నయ'లో జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించిన మంత్రి రోజా





పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రాజానగరం: ఓటమిని గెలుపునకు తొలిమెట్టుగా చేసుకుని సాధనను కొనసాగిస్తే విజయం తప్పక వరిస్తుందని ఏపీ టూరిజం, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి రోజా అన్నారు. నన్నయ యూనివర్సిటీలో నాలుగు రోజులపాటు జరిగే వెస్ట్ అండ్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను శనివారం ఆమె ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారుల నుంచి మంత్రి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రోజా మాట్లాడుతూ దేశానికి మంచి పేరు తీసుకువచ్చేలా పోటీలలో సత్తాను చాటాలని క్రీడాకారులకు హితవు పలికారు. ఎంతో మంది క్రీడాకారులకు సరైన శిక్షణ, వేదిక లేక ప్రతిభ మరుగున పడిపోతుందన్నారు. సినీమా, రాజకీయ రంగాలలో తనకు ఎదురైన ఒడుదుడుకులను ప్రస్తావిస్తూ కష్టాలొచ్చాయని వెనుకడుగు వేయలేద్నారు. ప్రతిభను నమ్ముకుని ప్రయత్నాన్ని కొనసాగించానన్నారు. ఆత్మవిశ్వాసం సడలిపోనివ్వకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ దివంగతనేత వైఎస్సార్ చూపిన బాటలోనే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కూడా పయనిస్తూ పేదలు ఉన్నత విద్యనభ్యసించేలా అవకాశాలు కల్పిస్తున్నారన్నారు.,విద్యారంగంలో విన్నూత్న మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ఈ కారణంగానే పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతున్నారన్నారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ నన్నయ వర్సిటీలో క్రీడాపరంగా ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఖేలో ఇండియా ప్రాజెక్టు తరపున రూ.20 కోట్లకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మొదటి విడతగా రూ.8.3 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజానగరం ఎమ్మెల్యే, జక్కంపూడి రాజా మాట్లాడుతూ దివాన్‌చెరువు, సీతానగరంలలో మల్టీలెవెల్ ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్రీడాకారులకు శుభాకాంక్షలు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమ చంద్రారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. వీసీ ఆచార్య కె. పద్మరాజు మాట్లాడుతూ ప్రస్తుతం 90 యూనివర్సిటీల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, జేఎన్‌టీయుకే వీసీ ఆచార్య ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్‌చైర్మన్ ధ్యానచంద్ర, సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన రత్నగిరి



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 70 వేల మంది
- దేవస్థానానికి రూ.70 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసంలో చివరి శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 70 వేలకు పైగా భక్తులు సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం నాలుగు గంటల సమయానికి 7,100 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.70 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తెల్లవారుజామున ఒంటి గంట నుంచే వ్రతాలు, దర్శనాలు

రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో అధికారులు స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజామున ఒంటిగంటకు తెరిచి స్వామివారి వ్రతాలు ప్రారంభించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతమండపాలు, నిత్య కల్యాణమండపం, పాత కల్యాణ మండపాలు వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి అంతరాలయ దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు.

వ్రతాల్లో రూ.300 టిక్కెట్లే అధికం

రత్నగిరిపై శనివారం జరిగిన సత్యదేవుని వ్రతాల్లో దాదాపు 70 శాతం రూ.300 టిక్కెట్‌తో జరిగినవే. మొత్తం 7,100 వ్రతాలు జరగ్గా వీటిలో సుమారు 5 వేల వ్రతాలు రూ.300 టికెట్లతో జరిగినవే. వ్రతాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరగా ప్రసాదం విక్రయాల ద్వారా రూ.25 లక్షలు ఆదాయం వచ్చింది. మిగిలిన విభాగాల ద్వారా రూ.15 లక్షలు వచ్చింది. కాగా కార్తిక మాసంలో ఇప్పటి వరకు సత్యదేవుని వ్రతాలు 1,17,500 జరిగాయి. సుమారు 10 వేల మందికి పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. కార్తిక మాసంలో చివరి ఆదివారం, సోమవారం కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆ రెండు రోజులు కూడా తెల్లవారుజామున ఒంటి గంటకు సత్యదేవుని ఆలయాన్ని తెరిచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య


నూతన కుమారి (పాత చిత్రం)

కొత్తపల్లి: తల్లి మందలించిందని ఒక బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు ఎస్సీ పేటకు చెందిన బొండాడ వెంకటరత్నం శనివారం ఉదయం కూలి పనికి వెళ్లింది. ఆమె కుమార్తె నూతన కుమారి (16) ఇంటి పక్కన ఉన్న వారి ఫోన్ తీసుకుని పలుమార్లు ఫోన్ చేసింది. దీంతో విసుగు చెందిన వెంకటరత్నం కుమార్తెను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నూతన కుమారి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి కృపానందం ఫిర్యాదు మేరకు ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్‌లో పడి మత్స్యకారుడి మృతి

అల్లవరం: తుమ్మలపల్లి పంచాయతీ పరిధి ఇటుకులగుంట ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు కొల్లు సహదేవుడు (42) చేపల వేట సాగిస్తూ దైవాలపాలెంలోని బెండా నార్త్ డ్రెయిన్‌లో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వేటకు వెళ్లిన అతడు డ్రెయిన్‌లో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఒడ్డుకు తీసుకుని రాగా, అప్పటికే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె చిలకలపూడి కృప ఫిర్యాదు మేరకు అల్లవరం ఎస్సై హరీష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య జీవనోపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటోంది.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కామేశ్వర్‌కు స్థానం



అమలాపురం టౌన్: తపాలా స్టాంపుల సేకరణలో పట్టణానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. గత ఏడాది ఆయన కరోనా నాణేల సేకరణలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. తాజాగా తపాలా స్టాంపుల సేకరణకు గాను ఈ ఏడాది కూడా లిమ్కా బుక్‌లో స్థానం దక్కించుకున్నారు. గతంలో బిహార్‌కు చెందిన కాశీ ప్రసాద్ 78 తపాలా స్టాంపులతో రికార్డు పొందగా.. ఇప్పుడు కృష్ణ కామేశ్వర్ 216 స్టాంపులతో ఈ ఘనత సాధించారు. 1957 నుంచి 2016 వరకూ భారతీయ తపాలా శాఖ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన స్టాంపుల్లో రూ.2 కన్నా తక్కువ ముఖ విలువ కలిగిన వాటిని కామేశ్వర్ సేకరించారు. ఈ రికార్డుపై లిమ్కా ప్రతినిధులు మెయిల్ ద్వారా తనకు సమాచారం ఇచ్చారని, త్వరలోనే రికార్డు ధ్రువపత్రం పోస్టులో పంపుతారని ఆయన తెలిపారు.

ఆరోగ్యంపై తేనె పూసిన కత్తి

- జిల్లాలో పెరుగుతున్న సుగర్ బాధితులు
- ఆందోళనకర స్థాయిలో వ్యాధి విస్తరణ
- చిన్నారుల్లోనూ సమస్య
- నేడు రాజమహేంద్రవరంలో జాతీయ సదస్సు ప్రారంభం



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): శారీరక శ్రమకు దూరం కావడం.. తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిళ్లు.. యాంత్రికమైన జీవన విధానం.. పడుతున్న శ్రమకు, జీవనశైలికి మధ్య సమతుల్యత లోపించడం.. ఫలితంగా రకరకాల అనారోగ్యాలు.. వీటన్నింటిలోనూ చాప కింద నీరులా విస్తరిస్తున్న మహమ్మారి మధుమేహం. అందరూ సుగర్ వ్యాధిగా.. వైద్య పరంగా డయాబెటిస్‌గా పిలిచే ఈ వ్యాధి తియ్యని కత్తిలా మనలో ప్రవేశించి, నొప్పి తెలియకుండా శారీరక వ్యవస్థను నిలువునా కోసేస్తోంది. ప్రాణాంతకంగా మారుతోంది. రాష్ట్రంలో 40 లక్షల మంది మధుమేహ రోగులున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వీరి సంఖ్య ఆందోళనకర స్థాయిలోనే ఉందని నిర్ధారించారు. ముఖ్యంగా యాంత్రిక జీవన విధానాన్ని అవలంబిస్తున్న పట్టణ ప్రజల్లో 15 శాతం మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమలో మార్పు కారణంగా గ్రామీణ ప్రాంతంలో 12 శాతం, గిరిజన ప్రాంతంలో 8 శాతం మంది మధుమేహం బారిన పడినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఈ వ్యాధి వస్తే ఆందోళన చెందడం మానాలని, దీనికి కళ్లెం వేయడం కూడా మన చేతిలోనే ఉందని వైద్యులు చెబుతున్నారు.

కళ్లెం వేయకపోతే కష్టాలు తప్పవు

మధుమేహం సోకినవారు ఆరోగ్యకరమైన జీవన విధానం అలవాటు చేసుకోవాలి. లేకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగిపోయి, రక్తనాళాలు, నాడులు తీవ్రంగా దెబ్బ తింటాయి. శరీరంలో అవసరమైన భాగాలకు రక్తం అందదు. సున్నితమైన నాడులుండే కంటిపై ప్రభావం పడి దృష్టి లోపం ఏర్పడుతుంది. మూత్రపిండాల వైఫల్యం కలుగుతుంది. గుండెపోటు, పక్షవాతం వంటి వాటికి మధుమేహం ముఖ్య కారణమవుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.

వ్యాయామం, యోగా, ధ్యానంతో మేలు

మధుమేహ బాధితులు వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అలవాటుగా చేసుకోవాలి. దీనివలన అన్ని అవయవాలకూ రక్తప్రసరణ మెరుగు పడుతుంది. గుండె, ఊపిరితిత్తులకు బలాన్ని చేకూరుస్తుంది. బరువు తగ్గడానికి దోహదపడుతుంది. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరిగి, చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మానసిక ఒత్తిడి కూడా దూరమవుతుంది.

నేటి నుంచి జాతీయ సదస్సు

నొప్పి తెలియకుండానే ప్రాణాలను హరిస్తున్న ఈ మహమ్మారి నివారణపై చర్చించేందుకు ఆది, సోమ, మంగళవారాల్లో రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. దీనిలో అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన 26 మంది వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. మధుమేహ నివారణ, నూతన విధానాలు, గర్భిణులు, పిల్లల్లో వచ్చే మధుమేహ చికిత్స విధానాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

ఇవీ లక్షణాలు

- అధికంగా దాహం వేయడం.
- ఎక్కువసార్లు మూత్ర విసర్జన.. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉండటం.
- తక్కువ సమయంలోనే ఎక్కువగా అలసిపోవడం.
- తక్కువ వ్యవధిలో బరువు కోల్పోవడం.
- శరీరంపై దురదలు.. గోకిన ప్రాంతంలో పుండ్లు ఏర్పడటం.
- గాయాలు త్వరగా మానకపోవడం.
- ఇటువంటి లక్షణాలు ఎక్కువగా 40 ఏళ్ల వయసు వారిలో కనబడతాయి. ప్రస్తుత జీవన విధానంలో 25 ఏళ్లు దాటిన వారిలో కూడా ఇటువంటి లక్షణాలు బయటపడుతున్నాయి.

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



మధుమేహం వచ్చిందని ఆందోళన చెందకూడదు. వ్యాధి బారిన పడిన వారు ఆహారపు అలవాట్లలో తప్పనిసరిగా మార్పులు చేసుకోవాలి. మైదా, దుంప ఉత్పత్తులతో చేసిన, కొవ్వు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తగ్గించాలి. తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాలు, పీచు పదార్థాలు తినడం ద్వారా శరీరానికి కావలసిన కేలరీలను అందించవచ్చు. ప్రణాళికాబద్ధంగా ఆహారం తినడం, తప్పనిసరిగా వ్యాయామం చేయడం, మందులు సక్రమంగా వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు.

– డాక్టర్ వద్దాది సురేష్, సుగర్ వైద్య నిపుణుడు

నెలకోసారి వైద్యులను సంప్రదించాలి



మధుమేహం ఉన్న వారిలో చాలా మంది కొద్ది రోజులు మందులు వాడి తగ్గింది కదా అని నిర్లక్ష్యం చేస్తారు. మందులు మానేస్తారు. అలా చేయకూడదు. కనీసం నెలకోసారి వైద్యులను సంప్రదించి, పరీక్షలు చేయించుకోవాలి. క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఆహార నియమాలు పాటించాలి. వ్యాయామం చేయడంతో పాటు, శరీరానికి తగిన విశ్రాంతి అందించాలి.

– కందుల సాయి, సుగర్ వ్యాధి నిపుణుడు

మారిన జీవన విధానంతో..

- మన ఆహారంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణ ప్రక్రియ ద్వారా గ్లూకోజ్‌గా విడివడుతాయి. శరీరంలోని క్లోమ గ్రంథి ఉత్పత్తి చేసే ఇన్సులిన్ అనే హార్మోన్ ఈ గ్లూకోజ్‌ను రక్తంలో కలిపి, శరీర కణాలకు శక్తిని అందిస్తుంది. క్లోమ గ్రంథిలో సమస్య ఏర్పడి, శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గినా, ఆగినా.. కణాలకు గ్లూకోజ్ చేరకుండా రక్తంలోనే ఉండిపోతుంది. ఇలా రక్తంలో గ్లూకోజ్ పేరుకుపోవడాన్నే మధుమేహం అంటారు.
- ఎక్కడికీ కదలనవసరం లేని నిశ్చలమైన జీవనశైలి, ఎక్కువ సమయం ఒకేచోట కూర్చుని ఉండటం, శారీరక శ్రమ లేని ఉద్యోగాలు, ఉద్యోగ పరంగా రాత్రి వేళ అధిక సమయం మేల్కొని ఉండటం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఊబకాయం వంటి కారణాలు సుగర్‌కు కారణమవుతున్నాయి.
- రాత్రుళ్లు నిద్ర మానుకుని టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి ఎక్కువ సమయం మెలకువగా ఉండటం.. ఆ ప్రభావంతో ఉదయం హడావుడిగా దైనందిన జీవితంలోకి ప్రవేశించడం, ఫలితంగా పనిలో ఎదురవుతున్న ఒత్తిళ్లు మధుమేహానికి దారి తీస్తున్నాయి.
- కుటుంబంలో ఎక్కువ మంది సంపాదనలో ఉండటంతో ఇళ్లల్లో ఆహారం వండుకుని తినడం తగ్గింది. సమయాన్ని ఆదా చేసుకునేందుకు చాలా మంది ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ తింటున్నారు. దీనివలన అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలు పెరగడం మధుమేహానికి దారి తీస్తోంది.
- వాతావరణ, వాయు కాలుష్యం, జన్యుపరమైన అంశాలు కూడా మధుమేహానికి కారణమని వైద్యులు చెబుతున్నారు.
- బాధితుల్లో 3 శాతం మందికి జన్యుపరమైన కారణాలతోనే మధుమేహం వస్తోంది. తల్లిదండ్రులు, తోబుట్టువుల్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే వారి రక్తసంబంధీకులకు కూడా వచ్చే అవకాశం ఉంటోంది.
- ఇటీవల చిన్నారుల్లో సైతం ఈ వ్యాధి బయట పడుతూండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వెలిబుచ్చింది. దీని నివారణకు ప్రత్యేక పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించింది.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 47 బెంచ్‌లలో నిర్వహణ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత


లోక్ అదాలత్‌లో బాధితులకు పరిహారం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ లోక్ అదాలత్‌పై ముందస్తు సమావేశాలు నిర్వహించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అధ్యక్షురాలు గంధం సునీత అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగలల్లోని 64 కోర్టుల పరిధిలో 47 బెంచ్‌ల ద్వారా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,168 కేసులు పరిష్కరించి, అవార్డులు జారీ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహన ప్రమాదాల్లో బాధితులకు పరిహారం చెల్లింపులో జాప్యం నివారణ, కక్షిదారులకు సత్వర న్యాయం చేయడం లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. దీని వలన ఇరు పక్షాలకూ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు మోడల్ చెక్కు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని సునీత అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఒకటో అదనపు జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావు, ఇతర న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదమొక్కులవాడా.. అనాథ రక్షకా..

- వాడపల్లికి పోటెత్తిన భక్తులు
- స్వామివారికి రూ.35.88 లక్షల ఆదాయం



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం, (అంతరచిత్రం) ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: పవిత్ర కార్తిక మాసం ఆఖరి శనివారం కావడంతో వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు వాడపల్లి బాట పట్టారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, భారీ క్యూ లైన్లలో బారులు తీరి మరీ స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి అర్చకులు వివిధ సేవలు నిర్వహించారు. రంగురంగుల సుగంధభరిత పుష్పాలతో స్వామివారిని కన్నుల పండువగా అలంకరించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది అన్నప్రసాదం స్వీకరించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకూ ధనుర్మాసం కావడంతో స్వామి వారికి సుప్రభాత సేవ బదులు తిరుప్పావై దివ్య ప్రబంధ పారాయణ నిర్వహిస్తారని తెలిపారు. అందువలన ఈ నెల 23, 30, వచ్చే నెల 6, 13 తేదీల్లో సుప్రభాత సేవ ఉండదని, భక్తులు ఈ విషయం గమనించాలని కోరారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా స్వామివారికి రూ.35,88,753 ఆదాయం సమకూరిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు. పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.